★కథానిక

# ★ శరణార్థులు ★

పి. ఆదిలక్ష్మి

త్రనయెదుట నిశ్చలముగా నిలిచియుండే లలితని మేట్రను ఒకసారి పరికించిచూసింది. చూడటము అరూపమునుగాదు. హృదయము, ప్రాణము వున్న వ్యక్తిగాకూడకాదు. ఏదో తన యంత్రాగారములో వుపయోగింపబడు యంత్రము వలె మాత్రమే. మేట్రను చాల సూక్ష్మమైన బుద్ధిగలది. ప్రథమ సమాగమమునందే ఇతరులనుగురించి తన యభిప్రాయ మేర్పరచుకొంటుంది, కాని లలితనుగురించి తన అభిప్రాయమిదిఅని ఆమె నిర్ణయింపజాలక యుండెను.

లలిత ఆ ఆస్పిటల్‌లో 3 మాసములనుండి యున్నది. చాలా సౌందర్యవతి. తెల్లటి నర్సు దుస్తులలో, మిక్కుటముగా ఉండే ఉంగరాల జుత్తును పూర్తిగా కప్పలేక పోతూండే చిన్న టోపీతో- లలిత ఆడవాళ్ళకే దేవతలాగ కనపడేది. ఏపనిగాని చెప్పక ముందే చేసేది. వినయవతి. తెలివిగలది. కాని............ చాల మెత్తని హృదయంగలది. మరీ అంత మెత్తని హృదయంకలది నర్సుపని ఎలాచేస్తుంది? ఎవరైనా బాధ పడుతున్నా- దుఃఖపడుతున్నా. సహించలేక పోయేది. సర్వము మరచిపోయి వాళ్ళను బుజ్జగిస్తూ. ఓదారుస్తూ కూర్చునేది. ఎల్లపుడునుతన విశాలహృదయ ద్వారమును అటువంటివారి కొరకు తెరచియుంచేది. ఇటువంటి గుణము నర్సుకు పనికిరాదని మేట్రను అభిప్రాయము. ఏవార్డులోనైనా ఎవరైనా చనిపోయినపుడు ఏనర్సైనా కళ్ళనీళ్ళు పెట్టుకొంటే మేట్రనుకు చాలాకోపము. అటువంటివారిని మొదటి వారంలోనే ఇంటికి పంపించివేసేది. కొంత మందికి మరల ఒకఛాన్సు ఇచ్చేది. ఆ కొంత మందిలో లలితకూడ ఒకతె, మిగిలిన ప్రొబేషనరీ నర్సులు తమ సీనియర్లనుచూచి కాఠిన్యత నేర్చుకొను చుండిరి. కాని లలితమాత్రం మెప్పటి వలెనే యుండెను.

ఇప్పుడు మేట్రనుకు పెద్ద ధర్మసంకటము వచ్చినది. కేన్సరువార్డులో చావుకు సిద్ధముగా వున్న మాధవిని బుజ్జగిస్తూవుండగా లలిత చూడబడినది ఆమెను అదృష్టవశాత్తు డాక్టరుప్రసాదే చూసినారు. తన క్రిందనుండు వారెవరైన అటువంటి ఫీలింగ్సు కనుపరిస్తే ఆయనకు చాలాకోపం. మాధవికేసు చాల విచారకరమైనదే. ఏమైన ఆమె తన ఎనిమిదిమంది బిడ్డలనువదలి పోబోతున్నది. ఈవిధమైనకేసులు దినమునకెన్నో సంభవిస్తూ వుంటాయి. అట్లని ప్రతినర్సూ రోగులను బుజ్జగిస్తూ కూర్చుంటే...డాక్టరుప్రసాదే చూచినందువలన ఇప్పుడీ సంకటంవచ్చింది. ఆయనపోయి మేట్రనుతో లలితకువార్నింగ్ ఇవ్వమనిచెప్పినాడు మేట్రన్ లలితను పిలిపించింది. ఇప్పుడు ఆమెను పంపించి వేయవలయునా - వద్దా? ఇదీప్రశ్న. అదిఎందుకోగాని మేట్రనుకు లలితనుచూస్తే ఎంతోఇష్టము. జాలి. ఆమె కఠినహృదయం కూడ లలిత విషయంలో మెత్తనైపోయింది. ఆమెసంగతి మేట్రనుకు పూర్తిగాతెలుసు. లలిత ఒక రెఫ్యూజీపిల్ల. రజాకార్ల దాడికి వాళ్ళ వాళ్ళంతా ఆహుతిఅయినారు ఇప్పుడు ఆమెకు నా అన్నవారెవరూలేరు లలితవంటి సౌందర్యవతిని ఎవరైనను పెండ్లిచేసుకొనియుందురు. ఆమెజీవితము కుదుటబడియుండును. కాని లలిత

ఆవిషయము నెత్తుకొననేలేదు. రజాకార్లచే భంగ పడ్డ స్త్రీని యెవరు వివాహమాడుదురు? ఆమె తన అన్నమును తానే సంపాదించు కొనవలయు నను కొన్నది. అందుకొరకే నర్సుగాచేరింది. తమ ఊరిలో జరిగిన దారుణములనుచూచి ఆమె హృదయం చలించిపోయిఉంది. అందుకనే ఈ దినం ఇలాచేసింది, ఇదంతా మేట్రనుకుతెలుసు.

అందుకనే ఇప్పుడు లలితకు ఆఖరిసారిగా ఛాన్సు ఇవ్వాలనుకొంది. ఇవ్వాల్సిన లెక్చరంతా ఇచ్చేసింది. ఒకనర్సు వార్డులలో ఎట్లు నడచుకో వాలో చెప్పింది. ఎన్నోబోధనలుచేసి "లలితా! ఇదేనీకు కడపటి.... అవును....కట్టకడపటిఛాన్సు అని గుర్తుంచుకో, ఇంక ఒకనెలవరకు నిన్ను పిల్లలవార్డుకు వేస్తున్నాము. ఇకతర్వాత నిన్ను క్షమించము, చెప్పిందల్లా జ్ఞాపకముంచుకో, ఏం? వెళ్ళు "అనింది.

లలిత మేట్రనుఆఫీసునుండి క్రొత్త నిశ్చ యాలతో వెలుపలకివచ్చింది, ఇక తను అంత మెత్తటి హృదయంతో ప్రవర్తించదు. ఎవరైనా రోగులు బాధపడుతూఉంటే వారిదగ్గరకే వెళ్ళదు. అసలు తననిప్పుడు పిల్లలవార్డుకిగా వేసింది. పిల్లల బాధలు పెద్దవారి బాధలకంటె తేలిగ్గా వుంటాయి గదూ కాబట్టి తానంతకష్టపడవలసి ఉండదు. అసలు పిల్లలు సులభంగా వారిబాధలు మర్చి పోతారు. వారి విచారము లెంతో లిమిటెడ్‌గా ఉంటాయి. ఇలాఅనుకొంటూ తనగదిలోకి వెళ్ళి పోయిందిలలిత.

పిల్లలవార్డులో ఎంతోవుత్సాహంగా పని చేస్తూందిలలిత. ఎప్పుడును పిల్లలతో అంతకలసి మెలసి ఉండలేదు. కాని వాళ్ళందరిని ఎంతో ప్రేమించింది. తనఫీలింగ్సుని కప్పి పుచ్చుకో టానికి విశ్వ ప్రయత్నము చేస్తూన్నది. కాని ఒక్కదినముతో ఆమె ఆనాడు చేసుకొనిన నిశ్చ యాలన్నీ భగ్నమైపోయినాయి, నిత్యానందము అనే చిన్నఅబ్బాయికి ప్లాస్టరు వేశారు. అతని చిన్ని అవయవములను లాగటం నొక్కటంచూసి సహించలేక పోయింది. డాక్టరుప్రసాదేప్లాస్టరు వేస్తూండేవాడు. లలితకు ఆయనమీద కోపం వచ్చింది, అయినా ఎందుకట్లా లాగటమును నొక్కటమును అనుకొంది. నిత్యానందుని ఏడ్పులు కేకలు వినలేకపోయింది, అతనికన్నీరు తన చేతి రుమాలుతో తుడిచి ఒక్క ఓదార్పు మాటైనా చెప్పాలనుకొంది. కాని డాక్టరుప్రసాదు కనుక లేకపోతేనా .... ....

డాక్టరుప్రసాదు చాల కఠినుడని లలిత అభి ప్రాయము. ఏమన ఒక్కసారైన ఆయన నవ్వు తూండగాగాని, నెమ్మదిమాట మాటలాడగాగాని లలిత చూడలేదు. ప్లాస్టరు వేస్తూన్నంతసేపు డాక్టరు నిత్యానందునితో మాట్లాడుతూనే ఉన్నాడు "ఇదిగో. అబ్బాయి. అలా అరవకూడదు, ఇది నీకు నొప్పిగాఉంటుందని నాకూతెలుసు. అలా అని వెయ్యకపోతే నీవీపు ఎప్పుడూ ఇలాగే వుంటుంది నీకు ఫుట్‌బాలుఆడటం రాదుగదూ. మరినీకు ఆడాలనిలేదూ? నేనెంతబాగా ఆడుతా నను కొన్నావు?" నిత్యానందుని అరపులు తగ్గి నాయి, ఏడుపు వెక్కిళ్ళలోకి వచ్చింది. డాక్టరు ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు. మాచెనుగురించి తాను చిన్నప్పుడు ఫుట్‌బాలు ఎంతబాగుగా ఆడు తూండినది ఇంకా ఎన్నోఎన్నో కబుర్లు. నిత్యా నందునికి క్రమంగాఏడుపుతగ్గింది, ఏవేవో ప్రశ్న లడుగుతున్నాడు, డాక్టరు మాట్లాడుతూనే పని పూర్తిచేశారు. లేచినిలబడి "బలే! నీవు బలే ధైర్యవంతుడివి, నాకు చేత నైనంతవరకు చేశాను, ఇంకనీకు బాగవుంటుంది, ఇంక పది రోజులలో నీవు బాగయిపోకపోతేచూడు. నేను వెళ్ళివస్తాను. ఏడవకుండా నిద్రపోవం"

డాక్టరుప్రసాదు నిత్యానందుని లాలించడం చూసి లలిత నివ్వెరపడి పోయింది. నిత్యానందు నితో అతడేమీ అబద్ధములు చెప్పలేదు. అతనికి బాధ కలిగిస్తూన్నానని ఒప్పుకూంటూనే అతనికి

బాగవుతుందని ఫుట్‌బాల్ ఆడేంతటి శక్తి కలుగుతుందని ఆ అబ్బాయిలో ఆశను రేకెత్తించినాడు ఇదంతా లలితకు ఎంతోకొత్తగా అవుపించింది. డాక్టరుప్రసాదు అంతతియ్యగా మాటలాడునని ఆమె కలనైనా తలచియుండలేదు. ఎప్పుడు సీరియస్‌గా ఉండేముఖం ఆసమయంలో నవ్వుతూ వుండినది, అసలే అందమైనమనిషి డాక్టరు ప్రసాదు. పొడుగుకుతగినలావు ముఖంలో మంచి వర్చస్సు. లలితకు డాక్టరు నిత్యానందునితో మాటలాడునపుడు అతనిఅందము ఆనుమడించినట్లుండినది. ఆరూపము ఆమె హృదయమున చిత్రింపబడినది, నిత్యానందునికి ప్లాస్టరు వేశేటపుడు డాక్టరుయొక్క అందమైనవ్రేళ్ళు. ఆమె మెత్తని ఎఱ్ఱచేతులకు తగిలినప్పుడు ఆమెహృదయ వీణె తంతులను ఎవరో మీటినట్లయ్యేది. ఆమెహృదయము ఏదో అనిర్వచనీయమైన ఆనందమును పొందేది. ఆదినమంతయు ఆమె ఎక్కడికి పోయినను, ఏమి చేయుచుండినను ఆమందహాస సుందరవదనము ఆమెను వెంటాడుచునే యుండినది, నిత్యానందునితో మాటలాడినప్పటి అతని తియ్యనికంఠము ఆమె చెవులలో మ్రోగుచుండినది, ఏదోపనిమీద అటునిటు తిరుగుచుండినపుడు డాక్టరును ఒకటి రెండుసార్లు చూచింది. అతనిని నేరుగా ముఖంలోకి చూడలేకపోయింది.

ప్రొబేషనరీ నర్సులలో చాలమంది, సీనియరు నర్సులలో కొంతమంది డాక్టరును ప్రేమించినారు. ఇది ఒక బహిరంగ రహస్యము. ఎన్నో విధములుగ అతనిని కదపిచూచినారు, కాని అతడేమియు చలించలేదు. ఈ నర్సుల కందరికీ ఎప్పుడూ ఇదేగొడవ, డైనింగ్ హాలులోగూడ అతనినిగురించిన మాటలే, అతనివిషయమై ఒకరినొకరెప్పుడూవేళాకోళము చేసుకొనుచుండిరి. ఇంతకూ లలితమాత్ర మేమిచేసినది? తనకు తెలియకుండగనే అతనిని ప్రేమించింది. ఆమె ఏపని చేయుచుండినను దేహముమాత్రముఅక్కడవుండేది, మనస్సు అతనితోగూడనే పొయేది. కాని డాక్టర్, లలితఅనేఒకనర్సు అతనిహాస్పిటలులో వున్నదనికూడ అత నసుకొనినట్లు లేదు,

ప్రతిఆదివారం లలితరెఫ్యూజీల క్యాంపుకు వెళ్ళేది. అక్కడ ఆమెఊరివారు ఉన్నారు. ఆమెకును, ఆమె పూర్వజీవితమునకును ఉండే సంబంధమువారే. వారికి లలితను చిన్నప్పటినుంచి తెలుసు. ఆమె మంచి గుణములు, వారికి బాగాతెలియును, అందువలన ఆమె వారి గుడారములకు పోయినపుడు తనయింటికి పోయినంతగా సంతోషించేది, వారితో ఏమీభయము లేకుండా మాట్లాడేది, జరిగిపోయినదానిని గురించి విచారించవద్దని, చనిపోయినవారి కష్టములను గూర్చి తలచవద్దని, భవిష్యత్తు బాగుగా నుండవచ్చునని వారికి ధైర్యముచెప్పేది- ఓదార్చేది- ఆఓదార్చటం ఆస్పత్రిలో రోగులతో మాట్లాడినట్లుగాదు, డాక్టరుప్రసాదు నిత్యానందునితో మాట్లాడినట్లు మాట్లాడేది- ఈవిధముగా తాను మాట్లాడుతూన్నందుకు వారు తన్నుద్వేషింతురని తలించిందిలలిత- వారితో మృదువుగా మాట్లాడాలనుకున్నా మాట్లాడలేక పోయేది- కాని వారు మాత్రము లలిత నెప్పటివలెనే ప్రేమిస్తూండినారు- "నేను వార్డులలో యెంతమృదువుగా మాట్లాడుతాను? ఇక్కడ మాట్లాడలేకపోతున్నానేమి? అక్కడ కఠినముగా ఉండవలసినదిపోయిఇక్కడ కఠినంగా మాట్లాడుతున్నాను- నేను మెత్తనిదానినని అందరికితెలుసు- అయితేమాత్రం.... అనుకొంది లలిత

అది ఆమె పిల్లలవార్డుకు వచ్చిన మూడవ వారం ఆదినం సీనియర్ నర్సు లలితనుపిలిచింది పిలిచి ఒకటవ వార్డుకుపోయి అక్కడ క్రొత్తగా వచ్చియున్న కేసును తీసుకరమ్మని పంపింది. అక్కడికితప్ప ఇంకెక్కడికి పొమ్మన్నాపోతుంది లలితకాని ఇప్పుడు పోననేదానికి కారణం ఏమి చెప్తుంది? అక్కడికిపోతే డాక్టరు ప్రసాదు

ఉంటాడు. అతనిని ముఖాముఖిగా చూచుట లలితకు ఇష్టంలేదు. తన మనస్సును తనే నమ్మలేక పోతూంది లలిత. ఒక్క చూపులోనే తన హృదయ రహస్యం బయలు పడుతుందేమోనని ఆమెకు భయం. అప్పుడు డాక్టరు ప్రసాదేమనుకొంటాడు? కానివెళ్ళక తప్పదు. వెళ్ళింది ఆమెగుండె వేగంగాకొట్టుకో మొదలుపెట్టింది. లోపలప్రవేశింపక పూర్వము తనమాటలనేకసారి సవరించుకొంది. ఆమెలోపల ప్రవేశింపగనే డాక్టరు తలయెత్తాడు అతని ప్రకాశవంతమైన కండ్లనుండి ఆశ్చర్యముతో కూడిన చూపు వెలువడింది. ఆ చూపును భరించలేక పోయింది లలిత ఆ చూపులోకూడ ఆమె నిశ్చయాలన్నీ సూర్యునిముందు మంచువలె పటాపంచలై పోయినవి. సిగ్గుచే ముఖం ఎఱ్ఱబడింది. అప్పుడు ఎంత అందంగా ఉంది? ఇహ ఆ ముఖంవంక చూడలేకపోయింది. తనను రాత్రింబగళ్ళు వెంటాడుతూన్న ఆ ముఖంవంక తప్ప ఇంకెక్కడనైనా చూడగలదు లలిత. ఇంక తన సంభ్రమమును సమాళించుకోలేకపోయింది. ఏమీ మాట్లాడాలని తోచలేదు. ఎందుకిక్కడికివచ్చిందో మరచిపోయింది. కొంచెంసేపు అలాగేనిలుచున్న తర్వాత తనకర్తవ్యము జ్ఞాపకమొచ్చింది. పిల్లల వార్డులో ఒక్క క్రొత్తపేషంటుని తీసుకునిరమ్మంటి. అని అతనికు సాహసంచేసి చెప్పింది. డాక్టరు ప్రసాదుకూడ ఏదో ఆలోచిస్తూన్నట్లుండి కొన్ని నిమిషాలు ఏమీమాట్లాడకుండా ఆమె వంకే చూస్తూండినాడు. ఆయనకూడ తనస్థితి లోనే ఉన్నాడేమో అనుకొంది లలిత మరల ఛీ ఆయనకు నామీదనే ఉంటుందా ఏమి అసలాయన నేనిక్కడ పర్చునున్నానని గమనించినట్లుకూడ లేదు అని అనుకొంటు, ఆ చూపుకు ఉక్కిరి బిక్కిరై పోయింది. మెల్లగాకుర్చీనుండి లేచి నాడు డాక్టరు. "అదుగో నీ పేషంటు అని ఒక ఎదుట ఉయ్యాలవైపు చెయ్యిచూపినాడు. లలిత ఒకమూలలో ఉంచియున్న ఆ ఉయ్యాలదగ్గరకు వెళ్ళి తొంగిచూచింది.

ఊదరించిన కడుపు సన్నగిలిపోయిన అనయవములతో ఒక చిన్న అబ్బాయి అందులో నున్నాడు. ఎంతో అసహ్యకరంగా ఉన్నాడు. తన బాధను చెప్పుకోలేకుండా మూల్గుతున్నాడు. పాపం! మూల్గటానికికూడ శక్తిలేదు. ఇదిచూడ గానే లలిత హృదయం ద్రవించిపోయింది. వెంటనే ఆ అబ్బాయిని మెత్తనిగుండ్రని చేతులలో తీసుకొని హృదయానికి హత్తుకొంది. ఏమేమో జిలిబిలిమాటలు ఆ అబ్బాయికిచెప్పింది. తనచేతు లలోనే లాలించింది. ఆ అబ్బాయి మూల్గటం క్రమంగా నిలిపాడు లలిత హృదయానికి మరీ అతుక్కుపోతున్నాడు. లలిత అతనివంకకే చూస్తూ అలా నిలబడిపోయింది.

ఈ దృశ్యాన్ని శ్రద్ధతో చూచుచుండిన డాక్టరు ప్రసాదువచ్చి లలిత ప్రక్కననిలుచున్నాడు "ఈ అబ్బాయి చాల అసహ్యముగ యున్నాడుగదూ? ఆ అబ్బాయికి ఎవరులేరు. ఇన్నిదినములు అతనిని చూచుచుండిన ముసలమ్మ ఈ దినమే చనిపోయినది పాపం! అందుకని ఈ నహాస్పటల్‌లో చికిత్స చేసి చూద్దాం అని నేనుతీసుకవచ్చాను." ఈ మాటలువిని లలిత తలపైకెత్తింది, అతనిముఖం సీరియస్‌గా ఉంది- ఆ కండ్లుమాత్రం లలితవంక చిలిపిగా నవ్వుతున్నాయి. ఇంక అతని ముఖం చూడలేకపోయింది. తలవంచుకొని రమేశ్‌ని తీసుకొని గబగబవచ్చేసింది. అబ్బ! అతని గొంతు ఎంతబాగుంది! మరునటి ఆదివారం మామూలుగా లలిత శరణార్థుల శిబిరాలకి వెళ్ళింది. నేరుగా ముసలి సరసమ్మ గుడిసెలోకి వెళ్ళింది. సరసమ్మ కీళ్ళనొప్పితో బాధపడుతూంది. ఆ చిన్న గుడిసెలో ప్రవేశింపగానే సరసమ్మ ఎవరితోనో మాట్లాడుతూండడంచూసింది. ఆ రెండవవ్యక్తిని చూడగానే లలితకు ఆశ్చర్యము. సిగ్గువేసింది. అక్కడ ఉండే రెండవవ్యక్తి డాక్టరు ప్రసాదే!

లలితను చూడగానే సరసమ్మ సంతోషంతో "అదుగో లలిత వచ్చింది. రా లలితా రా" అని డాక్టరువంకచూచి "ఏమి డాక్టరుబాబు లలిత చాల అందమైనదిగదూ" అనింది డాక్టరుముందు ఆమాట అనేటప్పటికి లలిత సిగ్గుతో చచ్చిపోయింది. ఆ నీలిరంగు సిల్కుచీరలోను, ఆ నల్లటి ఉంగరాల జుత్తుతో, వేశినరెండు జడలతోను దేవలోకంనుండి దిగివచ్చిన అప్సరలాగే ఉండింది. డాక్టరు ప్రసాదు సిగ్గుచే ఎఱ్ఱబడిన ఆ మొఖమును చూడగనే విభ్రాంతుడయిపోయినాడు. ఆనందంగానవ్వి, "అందగత్తెమాత్రమేనా? నేనుదినం హాస్పిటల్‌లోచూడ్డంలేదూ? ఎంతవినయం ఎంత అణకువ పనికూడా చాల చక్కగా చేస్తుంది, మైత్రనుకు లలితంటే చాల ఇష్టమనుకొంటాను, ఏం లలితా అక్కడే నుంచున్నావేం రా కూర్చో" అన్నాడు. లలిత మెల్లగావచ్చి ప్రక్కగాకూర్చుంది. డాక్టరు మొహం చూపెందుకు ఆమె హృదయం దడదడ కొట్టుకుంటూంది.

ఎందుకో ఆమె హృదయం సంతోషించింది, డాక్టరుకు శరణార్థులంటే చాలశ్రద్ధ అని నరసమ్మ చెప్పింది, తానుకూడ ఒక శరణార్థియేగదా అని లలిత ఆలోచించ సాగింది, ఇంతలో డాక్టరు ప్రసాదు లలితను హటాత్తుగా ప్రశ్నించాడు,

"ఏం లలితా? నర్సింగ్ ఎట్లున్నది? నీకిష్టమేనా?"

"యిష్టంగానే ఉంది డాక్టర్"

"ఏమిటి? యెప్పటికీ నర్సుగానే ఎల్లకాలం ఉంటావా?"

"అవును డాక్టర్ ప్రపంచములోని మంచి ఉద్యోగములలో ఇదీ ఒకటి అని కదా అందరి అభిప్రాయము. ఇంతకన్నా శరణార్థి ఏమిచేయ గలుగుతుంది?"

డాక్టరు ఔనన్నట్లు నవ్వేడు, లలిత తలయెత్తి చూచింది. అతని కండ్లు చిలిపిగానవ్వాయి, దానికి అర్థం అతేగాలనుసంది లలిత. ఇంతలోలేచి పోయాడు వెళ్లేటప్పుడుకూడా వ్యంగంగానవ్వుతూ వెళ్లాడు.

లలిత తనబసకు వచ్చినప్పుడు ఆమెహృదయం యెంతో తేలిగ్గాను ఆనందంగాను ఉండినది. ఆయనకూడ మానవుడె అనుకుంది. నరసమ్మ అన్నంత అందంగా వున్నానాఅనుకొని అద్దంలో ఒకసారి తనమొఖంచూచుకొని మురిసిపోయింది. "ఆయనకూ నవ్వటం తెలుసు. వేళాకోళం ఆడటం తెలుసు. ఆ ప్రకాశించేకళ్ళు, ఆచిలిపి కళ్ళు, అబ్బ! ........"ఇటువంటి ఆలోచనలతోనే నిద్రపోయింది. రాత్రంతా ఏవేవో తీయని కలలు.

ఇన్నిదినములు రమేశ్‌కు మంచిట్రీట్‌మెంటు జరిగింది. అందరు అతనిని చూచుకొనువారే. మైత్రను యెప్పుడూ అతనివి పరిశీలిస్తూవుండేది. హాస్పిటల్‌కు యెవరు విజిటర్సువచ్చినా ఆచక్కని చిన్నిమంచంమీద పండుకొనియున్న రమేశ్‌ను చూపించువారె. ప్రతిడాక్టరూ, ప్రతిస్పెషలిస్టూ వచ్చి అతనిని చూచేవారు. నర్సులు యెప్పుడూ అతని దేహస్థితినిగూర్చి చర్చించేవారు. రమేశ్‌ని తన చార్జిలో తీసుకొన్ననర్సు తనసాయ శక్తులా అతనికొరకు పాటుపడేది. కానిరమేశ్‌లో యెంతమాత్రము మార్పు కనబడలేదు. యెప్పటి వలెనే యున్నాడు. కాని ఇంతమందిదయవలన బ్రతికిమాత్ర మున్నాడు,

లలిత శరణార్థి శిబిరాలకి పోయివచ్చిన మరుసటి దినమే వార్డులో డాక్టరును చూచింది, ఆ నవ్వులు. ఆ మందహాసాలు అన్నీపోయినాయి. మళ్ళీ మొదట కఠినత్వం అతనిలో ప్రవేశించింది. ఆ సీరియస్ ముఖాన్ని చూడగానే లలిత ఆనందం నిన్నటి సంతోషం అంతా తృటిలో ఎగిరిపోయినాయి. పాపం! లలిత అటువంటివాని నెందుకు ప్రేమించింది? డాక్టరు ప్రసాదుకు లలిత అందరివలె ఒక నర్సు మాత్రమే అంతే, మరి లలిత నెందుకు ప్రేమిస్తాడు? లలితకేమైనా స్పెషల్

క్వాలిఫికేషన్సు ఉన్నాయా? అందం ఉంది. ఉంటే.........అతనికి లలితయొక్క లోపము లన్నీ తెలుసు ఆమె నర్సు పనికి తగదని అతని అభిప్రాయము. అందుకనే తాను ఎల్లకాలం నర్సుగా ఉంటానంటే నవ్వినాడు ఆ నవ్వును చూచి తనను ప్రేమిస్తాడని భ్రమ పడింది లలిత. అసలు అతనిని వివాహము చేసుకొని సుఖపడే అదృష్టం ఎవతకుందో? తనని అతనెందుకు ప్రేమిస్తాడు? తనని తలద్రొక్కినవాళ్లు అతనికి దొరుకుతారు,

ఈ ఆలోచనలతో బుర్ర తిరిగిపోయింది లలితకు, ఇంకా ఎందుకతని ఎదురుగుండా నిల్చునిఉండటం? గబగబ వార్డునుండి వెళ్ళిపోయింది, పోయే త్రోవలో రమేశ్ మంచం దగ్గర స్టాఫు నర్సు, సిస్టర్ నిల్చుని వుండటం చూసింది, దిగులుతో కూడియున్నవారి ముఖములను చూడగనే రమేశ్ ఎలా ఉన్నాడోనని భయంవేసింది అక్కడకు వెళ్ళి చూడాలనుకొంది. తన ఆశను త్రొక్కివేసి తన పనిమీద వెళ్ళింది, కాని హౌస్ సర్జన్ కూడ అక్కడికే రావటంచూసి ఇక ఓర్చుకోలేకపోయింది రమేశ్ ఎట్లున్నదో తెలుసుకోవలెనని ఉబలాటపడింది, రమేశ్ చనిపోతాడని గ్రహించుకుంది. కాని అతనిని చూడకుండా వెళ్ళిపోవాలి. తనని తనే నమ్మలేకపోతూంది లలిత. అక్కడికి పోయి రమేశ్‌నిచూస్తే ఏమిచేస్తుందో! అక్కడనే ఏడుస్తే? తన ఆఖరి సదవకాశం కూడ పోతుంది. ఇంక తను ఎందుకు పనికి రాకుండా పోతుంది, ఇంక కొన్ని నిముషములలో తన డ్యూటీ అయిపోతుంది. తాను ఎల్లకాలం నర్సుగా ఉంటానంటే నవ్వినాడు డాక్టరు ప్రసాదు. తన హృదయం ఇటువంటిదని తెలిసే ఆయన నవ్వింది, ఇలా లలిత ఆలోచించు చుండగానే దైవ వశాత్తు గంట వినపడింది. లలిత డ్యూటీ రూముకు పరుగెత్తిపోయింది, తన వస్తువులను తీసుకొని ఇనకు వెళ్ళిపోయేటందుకు.

తీరా పోయింతర్వాత తనచేతిలోనే ఉంది రమేష్ టెంపరేచరుచీటు అది మరల యథాస్థానంలో పెట్టేందుకుగాను మరల వార్డులోకి వెళ్ళింది. వార్డులోనకినచ్చేటప్పటికి ఒకసన్నటి జాలికరమైన మూలుగు వినబడింది, పాపంరమేశ్ బాధతో మూలుతున్నాడు, దగ్గరలోయెవరునులేరు. వెళ్ళియెత్తుకుందామనుకుంది కానిఇంతలో ఆదినం ఆఫీసులో మేట్రను బోధనలు, తననిశ్చయాలు, శరణార్థుల శిబిరాలు డాక్టరు ప్రసాదు, అతనిచిలిపి నవ్వు ఆ కండ్లు............ ...అంతా ఒక సారి సినిమా రీలులాగ ఆమెకండ్లు ముందుతిరిగింది. తను యెంతమాత్రం మెత్తబడగూడదనుకొంది. ఆ మూలుగును వినిపించుకోకుండా వెళ్ళిపోవాలనుకుంది. ఇంతలో రమేశు మూలుగు మరల వినపడింది. ఇంక సహించలేకపోయింది, ఇప్పుడు రమేశ్‌ని చూడాలి అనుకుంది, ఇదే ఆఖరు అనుకొని రమేశుని తీసుకొనుటకు వంగింది. ఇంక తను నర్సుగఉండలేదు. తన ఆఖరి అవకాశం అయిపోయింది బాధతోగూడిన రమేశునికండ్లు చూడలేకపోయింది లలిత, చల్లటి మంచంమీదనుండి తన వేడిచేతులలోనికి తీసుకుంది రమేశుని, తనహృదయానికి హత్తుకుంది, చేతులలో లాలించింది, సాధారణంగా తల్లులు పిల్లలకుచెప్పే అర్థంలేనిమాటల నెన్నిటినో చెప్పింది, అతని చిక్కిపోయిన చెక్కిలమీద తనమున్నటి చెక్కిలనుపెట్టి ఏమేమో చెప్తున్నది క్రమంగా మూల్గటం నిలిపి నిద్రపోయాడు, రమేశ్, ఇంకా లాలిస్తూనే ఉన్నది లలిత. ఈ దృశ్యమును అక్కడకు కొంచెము దూరములో నిలబడి మాట్లాడుతూన్న డాక్టరు ప్రసాదు స్టాఫ్ నర్సు చూచారు,

ఆది చూడగానే స్టాఫ్ నర్సుకు షాక్ తగిలినట్లయ్యింది. "నర్సు!" అని ఒక్క కేకవేసింది- లలిత తిరిగి చూసింది. ఆమెకు కనపడింది డాక్టరు ప్రసాదు ముఖము మాత్రమే ఈ సారి

అతనిని చూడగానే ఆమెముఖము ఆపజయంతో నిండిపోయింది. ఇంక ఆమె వుద్యోగం అయిపోయింది. నిద్రపోతూండే రమేశ్‌ను మంచంలో మెల్లగా పండబెట్టింది. డాక్టరుప్రసాదు చూచిందికి ఆమెకు పెద్ద కష్టంగా వున్నది. ఇక వెళ్ళిపోబోతూంది "నర్సు" అని పిలిచాడు డాక్టరు ప్రసాదు మెల్లిగా ముఖంఎత్తి చూసింది. "నే నిప్పుడు నీతో మాట్లాడాలి, నా ఆఫీసురూములో నాకొరకు వుండు." అధికారయుతంగా వున్నది ఆస్వరం. మరల తన సంభాషణలోనే మునిగి పోయాడు డాక్టరు.

లలిత తడబడే అడుగులతో మెల్లగా డాక్టరు ప్రసాదు ఆఫీసు రూముకు వెళ్ళింది. ఆ రూము ఎంతో శుభ్రంగా వుంది. అక్కడ ఎవరూలేరు. గవాక్షమునకు ప్రక్కన ఒకకుర్చీవున్నది. దానిలో కూలబడింది లలిత. ఆమెముఖం వేడిగా వుంది కండ్లు నొప్పిపెడుతున్నాయి. కుర్చీలో చేరగిలబడి ఆలోచనా సముద్రంలో మునిగిపోయింది. డాక్టరు తన నెందుకక్కడికి రమ్మన్నది ఏమి చెప్పబోవునది తెలుసు. గెంటివేయించుకోకుండా రాజీనామా నివ్వమంటాడు. అతనిచేత చెప్పించుకోకుండానే తాను వెళ్ళిపోతుంది రాజీనామానిచ్చి పోవటమా?- ఎక్కడికి? ఆ; ఎక్కడికైనా; ఈ విశాల ప్రపంచంలో తనకు తావే దొరకదా? లలిత ఏడ్వాలనుకొంది. అట్లయినా కొంత హృదయభారం తగ్గుతుందని కాని ఏడ్పు రావటమేలేదు. కండ్లల్లో నీళ్ళులేవు. ఎండిపోయి వున్నాయి కండ్లు. గవాక్షముగుండా చూస్తూంది లలిత. అటువంటి తోటలోనే తాను, డాక్టరు విహరించినట్లు? అతడు తన కెన్నో చిలిపి కబుర్లు చెప్పినట్లు ఆలోచనలుచేసి ఆ స్వప్న సౌధములన్నియు వెంటనే కూలిపోయినవి అనుకుంది లలిత. ఆమె హృదయం నిరాశతో నిండిపోయినది. ఆమె ముఖంనుండి వేడి నిట్టూర్పు వెలువడింది.

డాక్టరు ప్రసాదు మెల్లగా లోపలికి వచ్చి మెల్లగా అడుగులు వేస్తూపోయి లలిత దగ్గర నిలబడినాడు. ఆయన అక్కడ వున్నట్లు లలిత గ్రహించి లేవబోయి లేవలేకపోయెను. ఇంక లలితకు నోటిమాట రాలేదు. సంభాషణ యెలా మొదలు పెట్టాలో తెలియలేదు. రెండుసార్లు గుటకలు మింగింది. యెండిపోయిన పెదవులను తడి చేసుకొంది. యెంతో కష్టంమీద నోటినుండి మాట పెగులుకొని వచ్చింది. "నేను రాజీనామా నివ్వబోతున్నాను"అంది. ఇంకేమనటానికి తోచలేదు.

"నిజంగానా, నాకు చాలాసంతోషంగావుంది" అన్నాడు డాక్టరు. ఆయన కంఠస్వరము విని ఆశ్చర్యపోయింది లలిత' ఇందాకటివలె కఠినంగాను, అధికారయుతంగాను లేదు, యెంతో మృదువుగాను, ప్రేమ పూరితంగాను వున్నది "నేను ఇంతకుముందు చేసిన పని తప్పని నాకు తెలుసును. నేను చట్టవిరుద్ధముగా ప్రవర్తించాను.. రమేశ్ యెంతో చేరువగా అవుపించాడు. అతనికి తల్లి యొక్క లాలన అవసరం. అతని తల్లి గనక ఆ సమయంలో అక్కడవుంటే నేను చేసినపని చేసివుండేది. అయితేగూడ నేనుచేసినది నేరమే ఇదే నా కడపటి చాన్సు దానిని నేను పాడుచేసుకొనినాను. ఇంతకూ మీరు చెప్పిందే నిజం" అనింది లలిత, డాక్టరు ముఖంలో ఆశ్చర్యం కనుపించింది." నేను చెప్పిందా లలితా? ఏమిటది?" "నేను.........నేను.........నర్సుగా యెల్లకాలము వుండలేనని, నేను...చాల మెత్తనిదానిని నర్సు పనికి తగను, "ఈ మాటలామె హృదయమును చేదించుకొని వచ్చినవి- ఇన్ని దినములు కఠినంగా వుండుటకామె యెంత ప్రయత్నించినదో దేవుని కెరుక. ఈ నెల దినముల నామె యెంత యొద్వేషించినది. ఇంక తనను పంపించి వేస్తారు. యెక్కడికి పోతుంది? ఆమె కెవ

రున్నారు. నిరుత్సాహము. నిరాశ, నిస్పృహ నీటితో ఆమె హృదయం నిండిపోయింది. ఆమె వణకుట మొదలుపెట్టింది. లలిత ధైర్యముగా నుండాలని ప్రయత్నించింది, ఆ కండ్లలో బాధ యెక్కువైపోయింది. లలిత ఏడ్వను మొదలు పెట్టింది. ఆపుకోవాలన్నా చేతకాలేదు- చేతులలో ముఖమును పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్వ సాగింది.

"లలితా ఏడ్చుట బహుతప్పు ?'' అన్నాడు,

"తప్పే ?" అని లలిత సర్దుకొంది, తన బల హీనతకు నొచ్చుకొని కళ్లు తుడుచుకొంది,

"నువ్వు నేరము చెయ్యలేదే ? యెందుకు ఏడుస్తున్నావు ?"

"తప్పే మేట్రను ఆఖరి వార్నింగు ఇంతకు పూర్వమే ఇచ్చింది."

"లేదు నీ వల్ల ఆ కుర్రవాడు సహజంగా నిద్ర వచ్చి పడుకొన్నాడు. ఆ కుర్రవానికి నీవు మేలే చేశావు."

"మీ మాటల్లో వ్యంగం నాకు తెలుసు నన్ను వుద్యోగంనుంచి తప్పక తీసెయ్యండి- నేనే రాజీనామా ఇస్తాను-''

"నువ్వు రాజీనామా ఇవ్వడము నాకు చాలా సంతోషము-"

"ఏం ?"

"నీ కోరిక నెరవేరుతుంది"

"ఏమిటి నా కోరిక !"

"నీ మనసులో వున్నది నా మనసులో వున్నది ఒక్కటే కోరిక !"

అన్నాడు డాక్టరు, లలిత కళ్ళనిండా మళ్లా నీళ్లు నిండిపోయాయి. డాక్టరు లలిత ముఖాన్ని రెండుచేతులా తీసుకొని కన్నీళ్ళన్నీ తుడుచు కొన్నాడు.

"లలితా నువ్వింక శరణార్థివి కావు. నేనే నీకు శరణార్థిని" అన్నాడు డాక్టరు.


# ఆనందవాణి

పోస్టుబాక్సు నెం. 1583

12, తంబుచెట్టి వీధి, మదరాసు

(ప్రచురణ : ప్రతి ఆదివారం)

సాలుచందా .... రు. 14/-

అర్ధసంవత్సర చందా రు. 7-8-0

(తపాలు వ్యయంతో సహా)

* అర్ధసంవత్సరముకంటె తక్కువ కాలానికి చందా అంగీకరింపబడదు

* 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం

## చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే టప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలుపవలెను. లేకుంటే జవాబు ఆలస్యమవుతుంటది. మనియార్డర్లు మేనే జరు, ఆనందవాణి ఆఫీసు, 12 తంబు చెట్టివీధి, జి.టి. మద్రాసు కు పంపవలెను. వ్యక్తుల పేర పంపవద్దు.

—మేనేజరు